క్లుప్తంగా

ప్రభుత్వంపై విమర్శలు సరికాదు..

వైరా: రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఎం నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అన్నారు. బుధవారం వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను కొనుగోలు చేస్తూ.. రైతులకు క్వింటాకు రూ.500 బోనస్‌కూడా ఇస్తుందన్నారు. కేంద్రాల్లో ఎదైనా సమస్య ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, దాసరి దానియేలు, ఏదునూరి సీతారాములు, దొడ్డా పుల్లయ్య, పొదిలి హరినాథ్, పాలేటి నర్సింహరావు, అమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

పెనుబల్లి: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం గ్యారెంటీ పథకాల అమలు గురించి తెలంగాణ సాంస్కృతిక సారథి చాపలమడుగు కోటేశ్వరరావు బృందం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. మండల పరిధిలోని ముత్తగూడెం లంకాసాగర్ గ్రామాల్లో గృహజ్యోతి, వరి ధాన్యానికి బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలపై జ్ఞాన పథ కళానృత్యాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

కొణిజర్ల: రోడ్డు దాటుతుండగా వృద్ధుడిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పల్లిపాడులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లిపాడుకు చెందిన షేక్ జానీమియా లాలాపురం వైపు నుంచి వస్తూ రోడ్డు దాటుతుండగా ఖమ్మం వైపు నుంచి వైరా వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో జానీమియా రెండు కాళ్లు నుజ్జయ్యాయి. కాగ.. ఆయనను 108 ద్వారా ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం, పోలీసులు సంఘటనపై విచారణ చేస్తున్నారు.

మాదిగలు మరో ఉద్యమం చేయాలి

మధిర: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మధిర పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 9న మధిరలో ఏర్పాటు చేసే మండల సదస్సుకు ఉద్యోగులు, విద్యార్థులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీను మాదిగ, షేక్ రంజాన్, రాజారత్నం మాదిగ, కుక్కల బాబు, పండు, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ

బోనకల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి బండి పద్మ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. రాజకీయ వేదికల్లో మహిళల హక్కుల కోసం తాము పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గుడ్డూరు ఉమ, నల్లమోతు వాణి, తెల్లాకుల రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా న్యాస్ పరీక్ష

సత్తుపల్లిటౌన్: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్ర విద్యాశాఖ బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) సత్తుపల్లిలో ప్ర శాంతంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్ర భుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీ క్షను ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు పరిశీలించారు.

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ ఆదర్శ విద్యాలయంలో నిర్వహించిన న్యాస్ పరీక్షలను మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు, నాగులవంచ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కనపర్తి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్, ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణ లేకుండా.. బీటీ రోడ్ల నిర్మాణం

పాతర్లపాడు నుంచి గోవిందాపురం గ్రామం వరకు నిర్మిస్తున్న బీటీ రహదారి

- నిబంధనలకు తూట్లు
- భూములు కోల్పోతున్న రైతులు
- పరిహారం అందించని ప్రభుత్వం
- కోర్టుకు వెళ్లే ఆలోచనలో బాధితులు

చింతకాని: భూసేకరణ చట్టం ఇక్కడ వర్తించదన్నట్లుగా జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారు. రహదారుల నిర్మాణం విషయంలో అధికారులు నిబంధనలు పాటించటం లేదు. తద్వారా సన్న, చిన్నకారు రైతులకు సంబంధించి వ్యవసాయ భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు అంతా మాఇష్టమన్నట్లుగా మండలంలో రహదారుల నిర్మాణం చేపడుతున్నారని బాధిత రైతులు వాపోయారు. భూమిని నమ్ముకొని జీవిస్తున్న భూములు పోతే మా పరిస్థితి ఏంటని రైతులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల నిర్మాణాన్ని తాము వ్యతిరేకించనప్పటికి నష్టపోతున్న భూములకు పరిహారాన్ని ఇవ్వాలని, లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బాధిత రైతులు రైతులు వాపోయారు.

మండలంలో చేపట్టిన బీటీ నిర్మాణాలు..

మండలంలోని పాతర్లపాడు గ్రామంలోని రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు అనువైన గ్రావెల్ రహదారిని నిర్మించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఈ రహదారిని 60 అడుగుల మేరకు పెంచి బోనకల్ మండలం గోవిందాపురం గ్రామం వరకు పంచాయతీరాజ్ అధికారులు బీటీ రహదారిని నిర్మిస్తున్నారు. దీంతో ఇరువైపులా ఉన్నటువంటి చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.
- మండలంలోని పందిళ్లపల్లి గ్రామం నుంచి మత్కేపల్లి వరకు, అక్కడి నుంచి క్రాస్ రోడ్డు వరకు, నాగులవంచ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తుమ్మలమ్మ చెరువు, చింతకాని వరకు, నాగులవంచ గ్రామం నుంచి తిమ్మినేనిపాలెం, చొప్పకట్లపాలెం వరకు, నాగిలిగొండ గ్రామం నుంచి గొల్లెనపాడు వరకు కోట్లాది రూపాయల వ్యయంతో 45 నుంచి 50 అడుగుల మేరకు బీటీ రహదారుల నిర్మాణాలను చేపట్టారు.

భూ సేకరణ ఏది?

రహదారుల నిర్మాణం చేపట్టాలంటే ముందుగా భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూసేకరణ చేయాలి. దీనిలో భాగంగా నోటిఫికేషన్‌ను జారీ చేయాలి. అనంతరం గ్రామసభను ఏర్పాటు చేసి భూములను కోల్పోతున్న రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. భూముల బహిరంగ మార్కెట్ విలువను దృష్టిలో ఉంచుకుని ప్రాంతాల వారీగా రైతులకు నష్టం జరగకుండా అధికారులు పరిహారాన్ని నిర్ణయించి వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసిన తర్వాతనే రహదారి నిర్మాణాలకు సంబంధించి పనులను చేపట్టాలి. కానీ ఇవేమి చేయకుండా అధికారులు బీటీ రహదారుల నిర్మాణాన్ని చేపట్టడాన్ని రైతులు తీవ్రంగా తప్పు బడుతున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న రైతులు..

అధికారులు భూసేకరణ చేయకుండా బీటీ రహదారుల నిర్మాణాన్ని చేపట్టడంతో లక్షలు విలువచేసే భూములను కోల్పోతున్నట్లు బాధిత రైతులు తెలిపారు. తాము కోల్పోతున్న భూములకు నష్ట పరిహారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూములు కోల్పోతున్న చిన్న, సన్నకారు రైతులకు తగిన నష్ట పరిహారాన్ని అందించాలన్నారు.

నిబంధనలకు విరుద్ధం..



బీటీ రహదారుల నిర్మాణం విషయంలో అధికారులు నిబంధనలు పాటించకపోగా.. భూసేకరణ చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో నా కుటుంబానికి ఉన్న వ్యవసాయ భూమిలో రహదారి నిర్మాణానికి సుమారు 1.20 ఎకరాలు పోతుంది. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.60 లక్షల నష్టం జరుగుతుంది. రహదారుల నిర్మాణంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– నల్లమోతు ప్రభాకర్‌రావు, రైతు, పాతర్లపాడు

పరిహారం అందించాలి..



బీటీ రహదారి నిర్మాణానికి మాకున్న కొద్దిపాటి భూమిలో సుమారు 20 కుంటలు పోతుంది. వ్యవసాయంపై ఆధారపడి జీవించే మాకు రహదారి నిర్మాణంతో కోల్పోతున్న భూమి వలన తీవ్ర నష్టం జరుగుతుంది. అధికారులెవరూ రహదారి నిర్మాణంపై కనీస సమాచారాన్ని కూడా తెలియజేయలేదు. రహదారి నిర్మాణంతో కోల్పోతున్న భూములకు నష్ట పరిహారాన్ని ఇవ్వాలి.

– కమతం గోవిందమ్మ, మహిళా రైతు, పాతర్లపాడు

ఏడాది కాలంలోనే గ్రామాల అభివృద్ధి



ఏరుగట్లలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

పెనుబల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరీ చేసిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం మండలంలోని ఏరుగట్ల, రామచంద్రాపురం, చౌడవరం, వావిళ్లపాడు, పార్థసారధీపురం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల మెరుగు పరచడంతో పాటు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 5 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు కూడా అందించనున్నట్లు తెలిపారు. అనంతరం పెనుబల్లి -గంగదేవిపాడు గ్రామాల మధ్య హైలెవల్ బ్రిడ్జి పనులను ఆమె పరిశీలించారు. రైతుల ఇబ్బందుల మేరకు టేకులపల్లి-కుప్పెనకుంట్ల గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జిని.. హైలెవల్ బ్రిడ్జిగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రైతులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజాదేవి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

వేంసూరు: పేదలు, రైతుల అభివృద్ధి సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం వేంసూరు డబుల్ బెడ్ కాలనీ వాసులకు పట్టాలు పంపిణీ చేశారు. మండలంలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబాక్ చెక్కులు పంపిణీ చేశారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కుర్నవల్లిలో మహా అన్నదానం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి, మంగాపురం గ్రామాల్లో బుధవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గణపతి పూజ, అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్నవల్లిలో మహా అన్నదానం, మంగాపురంలో అన్నదానం నిర్వహించారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ..

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీషిరిడిసాయిబాబా మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అయ్యప్ప మాలాధారులకు గురుస్వాములు నిత్య అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. దీనిని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు గొడుగు శ్రీనివాసరావు, కేసగాని బాలకృష్ణ, బోళ్ల కొమరయ్య, జంగా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులు పెంచాలి



వైరా: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్న మాస్‌లైన్ నాయకులు



మధిర బస్ డిపో ఎదుట..

వైరా/మధిర: ఆర్టీసీ సర్వీసులు పెంచి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో బుధవారం వైరాలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, మధిర డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కార్యదర్శి అర్జున్‌రావు, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుల్లయ్య మాట్లాడారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల సర్వీసులు సరిపడడం లేదని ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యలదండి బాబు, బండారు భద్రయ్య, దర్గయ్య, ప్రతాప్, బద్రి, హనుమంతరావు, యలదండి బాబు, బండారు భద్రయ్య, కె. దర్గయ్య, బద్రి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఏసీపీ



తల్లాడ స్టేషన్‌లో పోలీసులకు సూచనలు చేస్తున్న ఏసీపీ రెహమాన్

తల్లాడ: తల్లాడ పోలీస్ స్టేషన్‌ను బుధవారం వైరా ఏసీపీ రెహమాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏడాది కాలం పాటు స్టేషన్ పనితీరుపై పరిశీలన జరిపి.. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి పోలీస్ శాఖకు పేరు తేవాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ సాగర్, ఎస్ఐ బి.కొండల్‌రావు పాల్గొన్నారు.

‘బూటకపు హామీలతో కాంగ్రెస్ పాలన’



ర్యాలీలో పాల్గొన్న కొండపల్లి శ్రీధర్ రెడ్డి

మధిర: తెలంగాణ రాష్ట్రంలో బూటకపు హామీలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆత్కూరు క్రాస్ రోడ్డు నుంచి జమలాపురం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుండా ఏడాది పాలన సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రుణమాఫీపై స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క బహిరంగ చర్చకు రావాలని.. రుణమాఫీ కానీ మధిర నియోజకవర్గం రైతులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి లేదా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

మల్లు నందిని జన్మదిన వేడుకలు



మధిర: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వైరా: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమాజ సేవ కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బుధవారం మండలాల్లోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి.. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదానాలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

వృద్ధాశ్రమాల్లో సరుకులు వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, ఎర్రుపాలెం గ్రామాల్లోని వృద్ధాశ్రమాలకు భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి బియ్యం, నిత్యావసర సరుకులు అందించగా.. జమలాపురంలోని బాలాజీ వృద్ధాశ్రమానికి రూ.20వేల విలువైన వాటర్ ప్యూర్‌ఫైర్ వాటర్‌ప్లాంట్‌ను వితరణ చేశారు. బుధవారం డిప్యూటీ సీఎం మల్లు నందని జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా సరుకులను అందజేసి.. వాటర్‌ప్లాంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యులు ప్రతాపరెడ్డి, నర్సింహారావు, లక్ష్మణరావు, కృష్ణారావు ఉన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ఏన్కూరు: విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటి డ్రగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అనంతరం యాంటి డ్రగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణప్రసాదు, బాబులాల్, రామారావు, టివి రావు, విజయలక్ష్మీ, రమాదేవి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు అందిస్తాం



జమలాపురం వద్ద సాగర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వాసంతి

ఎర్రుపాలెం: చివరి భూములకు కూడా సాగర్ జలాలు సరఫరా చేస్తామని జల వనరుల శాఖ కల్లూరు సెక్షన్ ఎస్ఈ వాసంతి తెలిపారు. బుధవారం మండలంలోని జమలాపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో చెరువులను, కాల్వలను ఆమె పరిశీలించారు. కల్లూరు సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ శ్రీమతి వాసంతి పరిశీలించారు. మైలవరం బ్రాంచ్ కెనాల్‌లో దెబ్బతిన్న యూటీలను మరమ్మతులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ రామకృష్ణ, డీఈ సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరారూరల్: వైరా సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్-1 ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పి.సుందర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య బుధవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

పెనుబల్లి: ఎటువంటి ఆంక్షలు లేకుండా పోడు భూములు సాగు చేసుకునే వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని వ్య.కా.స రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వీయంబంజర్ సీపీఎం కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ముప్పైఏళ్లుగా పోడు చేసుకుంటున్న ప్రజలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఫారెస్టు అధికారులు వెంటనే అక్రమ అరెస్టులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, విశ్వనాథం, చిరంజీవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



సింగరాయపాలెంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కొణిజర్ల: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు సడలించి గత రెండు రోజుల క్రితం తుఫాన్ వల్ల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సింగరాయపాలెం, సిద్దిక్‌నగర్, గుబ్బగుర్తి గ్రామాల్లో ఏఐకేఎంఎస్ నాయకులతో కలిసి పర్యటించి తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆలవాల శ్రీను, కంకణాల రామనర్సయ్య, కొత్తపల్లి సత్యనారాయణ, కంకణాల లక్ష్మి, బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సొసైటీ తీర్మానాన్ని వ్యతిరేకించిన గిరిజనులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం రైతువేదికలో బుధవారం నిర్వహించిన సభలో గిరిజన జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీ తీర్మానాలను గిరిజనులు వ్యతిరేకించారు. దీంతో సభ అర్ధాంతరంగా ఆగిపోయింది. ఈ సొసైటీకి చెందిన వ్యవసాయ పొలంలో చెరుకుపంటను ఫ్యాక్టరీకి తరలించగా వచ్చిన సొమ్మును భద్రపరిచేందుకు సమావేశం నిర్వహించారు. అయితే 52మంది సభ్యులకు గానూ.. 16మంది మాత్రమే అంగీకరించారు. మిగిలిన 36 మంది రెండు తీర్మానాలను తిరస్కరించి సమావేశం మధ్యలో వెళ్లారు. దీంతో సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ రామిరెడ్డి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణ

చింతకాని: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పాతర్లపాడు గ్రామానికి చెందిన కంచుమర్తి రామకృష్ణ ఎన్నికయ్యాడు. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నిర్వహించిన ఎన్నికల ఫలితాలను బుధవారం వెల్లడించగా 732 ఓట్ల మెజార్టీతో రామకృష్ణ గెలుపొందాడు.

6 నుంచి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ వార్షికోత్సవం

తల్లాడ: ఈ నెల 6 నుంచి 7వ తేదీ వరకు తల్లాడలో వేంచేసి ఉన్న వల్లీదేవి సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం ఐదో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు యాసా నాగేంద్రప్రసాద్, పున్నం శ్రీనువాసరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గోపూజ, అఖండ దీపారాదాన, దీక్షధారణ, పంచామృతాభిషేకం, హోమం, సుబ్రమణ్య షష్టి సందర్భంగా తణుగల మణికంఠ శర్మ ఆధ్వర్యంలో సుబ్రమణ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ జాలాది పార్థసారధి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2003 బ్యాచ్‌కు చెందిన సివిల్, ఏర్ కానిస్టేబుల్ వారు రూ. 2.50 విరాళాలు సేకరించి మృతుడి కుటుంబానికి అందించారు. భవిష్యత్తులో కూడా తమ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కానిస్టేబుళ్లు శ్రీనివాసరెడ్డి, సతీష్, హరి, కిరణ్, శ్రీను, మల్లెష్, సీజీ కృష్ణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



కొవ్వూరి గోపయ్య(ఫైల్)

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని కల్పతరురోడ్‌కు చెందిన కొవ్వూరి గోపయ్య(70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్ర నిధి బృందం సేకరించింది. నేత్ర దానానికి సహకరించి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

బోనకల్: మండల కేంద్రంలో పాస్టర్స్‌ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమోతీ, రాజారత్నం, ఎర్నెస్ట్‌పాల్‌లో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి దైవ సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్‌ఫెలోషిప్ నాయకులు యిర్మియా, ప్రవీణ్, భరత్‌కుమార్, ఏసురత్నం పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త కోనా జనార్దన్ రావు మనవరాలు, కోనా శ్రీధర్ కుమార్తె స్వప్నిక పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కనుమూరు వెంకటేశ్వరరావు, వాసవి పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకం



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కల్లూరురూరల్: వెదజల్లే పద్ధతిలో వరిసాగు లాభదాయకంగా ఉటుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎం.రూప అన్నారు. బుధవారం మండలంలోని మచ్చవరం రైతు వేదికలో రైతులకు నిర్వహించి శిక్షణా కార్యక్రమంలో.. ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం నుంచి వ్యవసాయ శాఖ అధికారిణి అరుణ జ్యోతి, భాస్కర్, పీఐఫౌండేషన్ నుంచి హర్షదీప్ పాల్గొని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్‌కల్యాణ్, వెంకయ్య పలువురు పాల్గొన్నారు.